పడకేసిన పారిశుద్ధ్యం

- కంపుకొడుతున్న డ్రెయినేజీలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మాచారెడ్డి: సర్పంచుల పదవీ కాలం ముగిసి తర్వాత ప్రత్యేక అధికారులను నియమించారు. దీంతో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి. మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి మురికి కాల్వలు కంపుకొడుతున్నాయి. ఇంట్లో నుంచి బయటకు వస్తే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందే వ్యాధులు సోకే కాలం. డ్రెయినేజీలు నిండిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో అనేక రకాల వ్యాధులు సోకే ప్రమాదముంది. మండలంలోని ఘన్‌పూర్‌లో కొద్ది రోజులుగా మురికి కాల్వలను శుభ్రం చేయకపోవడంతో మురికి పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో కుక్కలు, పందులు మురికి కాల్వల్లో పొర్లాడి వీధులన్నీ అపరిశుభ్రం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అందుబాటులో లేని అధికారులు..

ఒక్కో అధికారికి నాలుగైదు గ్రామాలకు ఇన్‌చార్జి ఇవ్వడం వల్ల అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. గజ్యా నాయక్ తండా చౌరస్తాలో రోడ్డు విస్తరణ చేశారు. కానీ డ్రెయినేజీ నిర్మించకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఘన్‌పూర్‌లో డ్రెయినేజీ పరిస్థితి

లింగంపేటలో మరీ అధ్వానం

లింగంపేట(ఎల్లారెడ్డి): మేజర్ గ్రామ పంచాయతీ లింగంపేట మండల కేంద్రంలో మురికి కాల్వలు అధ్వానంగా మారాయి. వర్షాలు పడితే ప్రజలు రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. 6 నెలల క్రితం సర్పంచ్‌ల పాలన ముగియడంతో గ్రామాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ప్రత్యేక పాలనలో అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదని పలు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో ఆరు నెలలుగా పేరుకుపోయిన మురికి కాల్వల్లోని చెత్తా చెదారం వర్షానికి రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దాంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూడిక తీయక నాలాల నుంచి మురికి నీరు, చెత్తా చెదారం దుకాణ సముదాయాల ముందు వచ్చి చేరుతుంది. దాంతో సరుకులు కొనుగోలు చేయడానికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. అధికారులు స్పందించి రోడ్లు శుభ్రం చేయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లింగంపేట బస్టాండ్ సమీపంలో పూడిక తీయకపోవడంతో వర్షానికి రోడ్లపైకి కొట్టుకు వచ్చిన చెత్త

‘నాణ్యమైన విద్యను అందించాలి’

రామారెడ్డి: సర్కార్ బడుల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి కోరారు. రామారెడ్డి మండల కేంద్రంలో బుధవారం రామారెడ్డి ఎంపీపీ దశరథరెడ్డి వివిధ పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టి సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సవిత, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, మండల విద్యాధికారి యోసేపు, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, బాలికల పాఠశాల హెచ్‌ఎం మురళి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందిస్తున్న ఎంపీపీ దశరథ్‌రెడ్డి

డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



గాంధారి(ఎల్లారెడ్డి): విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లు, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకే విక్రయించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఏవో నరేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో స్టాకు వివరాలు, బిల్లు బుక్కులు, విత్తనాల బస్తాలను పరిశీలించారు. ధరల పట్టికను రైతులకు కనబడే విధంగా ఉంచాలని సూచించారు. రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులు విధిగా రసీదులు దాచి ఉంచుకోవాలని సూచించారు.

‘నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం’



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను విక్రయిస్తున్నారని, తోక పేర్లు పెట్టి ప్రచారం చేస్తున్నారని, ఇరుకు బహుళ అంతస్తులలో స్కూల్ కొనసాగిస్తున్నారని యాజమాన్యంతో వాగ్వాదం చేశారు. విక్రయిస్తున్న పుస్తకాలను స్వాధీనం చేసుకుని, తోక పేరుతో ఉన్న ఫ్లెక్సీలను చించేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డి: రైతులు ట్రాన్స్‌ఫార్మర్లతో అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్ చోరీ చేస్తున్నారని అన్నారు. చోరీలు జరగకుండా రైతులు గస్తీ బృందాలుగా ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. గ్రామాలలో, పొలాల వెంట కొత్త వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై మహేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐ రవీందర్ నాయక్

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తుల పంపిణీ



సోమేశ్వర్ స్కూల్లో పుస్తకాలు, దుస్తుల పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వెంకట రమణ



దోమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



రాజంపేట మండల కేంద్రంలో.. డీపీఎం రమేశ్ బాబు



జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు బుధవారం తెరుచుకోవడంతో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించారు. విద్యార్థులు ప్రతి రోజు చదువును కష్టం అనుకోకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా వారు సూచించారు.



గాంధారిలో..



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ..



సదాశివనగర్‌లో.. ఎంఈవో యోసెఫ్

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎన్‌సీవోఈ బృందం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట, లింగంపేట అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పోషణ, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్ఎస్ఎఫ్‌పీ పథకంపై పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించి వివరాలు సేకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బృందం సభ్యులు డాక్టర్ అల్కామథుర్, రేషాదేశాయ్, గితిక గోవార్, సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు, యూనిసెఫ్ రాష్ట్ర బృందం, ఎస్ఎస్ఎఫ్‌పీ జిల్లా కో–ఆర్డినేటర్ బాలాజి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న బృంద సభ్యులు

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



మాచారెడ్డి: ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కామారెడ్డి ఏడీఏ అపర్ణ సూచించారు. బుధవారం కొత్తపల్లిలో గ్రీన్ హౌజ్ సేద్యంపై కేతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతికూల వాతావరణంలోనూ గ్రీన్ హౌస్ పద్ధతితో మంచి ఫలితాలు వస్తాయన్నారు. చిన్న సన్నకారు రైతులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ కేతి సంస్థ ఈ గ్రీన్ హౌస్‌ను 50 శాతం సబ్సిడీతో తీసుకువచ్చిందన్నారు. గ్రీన్ హౌస్ సేద్యంతో ఎన్నో లాభాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి, ఏవో రమ్యశ్రీ, ప్రభాకర్ తదితరులున్నారు.

పాఠశాల భవనాన్ని నాణ్యతతో నిర్మించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో చేపట్టిన గిరిజన గురుకుల బాలుర పాఠశాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని స్థానిక ఎంపీపీ వినీతారెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని రామాలయం వద్ద జరుగుతున్న గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించారు. సొంత భవనం లేకపోవడం వల్ల పాఠశాల నిర్వహణ చాలాకాలంగా కష్టమవుతుందన్నారు. విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, వంశీగౌడ్ తదితరులున్నారు.

మహిళ సమాఖ్య కేంద్రాన్ని సందర్శించిన అస్సాం ప్రతినిధులు



భిక్కనూరు: మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కేంద్రాన్ని అస్సాం రాష్ట్ర సభ్యులు బుధవారం సందర్శించారు. మహిళ సమాఖ్య లావాదేవీలను వారు పరిశీలించారు. మహిళలు తీసుకున్న రుణాలను వారు చేస్తున్న వ్యాపారాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట డీపీఎం సుధాకర్, డీఎంజీ రాము, ఏపీఎం శ్రీనివాస్ మహిళ సమాఖ్య అధ్యక్షులు రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డి అర్బన్: జమ్మూకశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయానికి బస్సులో వెళ్తున్న హిందువులపై ఉగ్రవాదులు దాడి చేసి ప్రాణాలను బలి తీసుకోవడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండించింది. బుధవారం స్థానిక నిజాంసాగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను వీహెచ్‌పీ నేతలు దహనం చేశారు. అనంతరం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి మాట్లాడారు. భారత సైన్యం ఉగ్రవాదులకు సరైన జవాబిస్తుందన్నారు. వీహెచ్‌పీ జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్‌రావు, కోశాధికారి నిత్యానందం, పట్టణ కార్యదర్శి వంగ ప్రసాద్, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ మంచాల రాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ జరిపించాలి



కామారెడ్డి టౌన్: నీట్ పరీక్షా ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని ఏబీవీపీ నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ ఫలితాల్లో 60 మందికిపైగా విద్యార్థులకు 99.9 శాతం మార్కులతో ర్యాంక్‌లు వచ్చాయని, దీని బట్టి పేపర్ లీక్ అయినట్లు ఆరోపించారు. సీబీఐకి విచారణ అప్పగించాలని డిమాండ్ చేశారు. నాయకులు రోహిత్, ఖలీల్, వెంకీ, అరవింద్, మురళీ, రాజు, బలరాం తదితరులున్నారు.

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని మైలారం గ్రామంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిలో ఉన్న కుళాయిల సంఖ్య, నీరు వస్తుందా లేదా వంటి వివరాలను తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శి సవిత ఉన్నారు.

వంట ఏజెన్సీ నియామకం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కొత్త వంట ఏజెన్సీని నియమించినట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రాజ్ తెలిపారు. గతంలో పని చేసిన వంట ఏజెన్సీ వారు వంట చేయడాన్ని మానేశారు. దాంతో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు సంగీతకు వంట ఏజెన్సీని అప్పగించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం వడ్డించడమే లక్ష్యంగా అమ్మ కమిటీ పని చేస్తుందని ఆయన తెలిపారు.

సమాచారం..

మైనారిటీ గురుకులాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాములు బుధవారం తెలిపారు. పీజీటీ సోషల్ స్టడీస్, స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీటీ సోషల్ స్టడీస్ బోధించటానికి సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఎడ్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. స్టాఫ్ నర్సు పోస్టు కోసం బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం 50 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 5 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ఈ నియామకాలు పూర్తిగా అవుట్ సోర్సింగ్ విధానంలో జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు కామారెడ్డి జిల్లా స్థానికులై కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7995057919.

క్లుప్తంగా

ఆయమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ గ్రామంలో 20 ఏళ్లుగా అంగన్‌వాడి ఆయమ్మగా విధులు నిర్వహిస్తున్న జింక గంగామణి(56) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దీనితో ఆయమ్మ దహన సంస్కారానికి డిపార్ట్‌మెంట్ నుంచి రూ.10వేలను కుమార్తె స్వప్నకు సీడీపీవో కళావతి అందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వాణి, పంచాయతి కార్యదర్శి గువ్వ నవీన్ పాల్గొన్నారు.

భూసేకరణ సర్వే పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి, కామిశెట్టిపల్లి, నస్రుల్లాబాద్ గ్రామాల మీదుగా నూతనంగా ఏర్పాటవుతున్న రోడ్డు పనులను, జరుగుతున్న భూసేకరణ సర్వేను ఆర్డీవో రమేష్ రాథోడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 10 ఎకరాల 13 గుంటలను సేకరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 765–డి హైదరాబాద్ నుంచి మెదక్–నర్సాపూర్–బాసర రహదారి ఏర్పాటుకు రైతులకు నోటీసులు అందించామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, గిర్దావార్ హన్మాండ్లు, తదితరులు ఉన్నారు.

రక్తదాత బాలుకు అవార్డు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా రోగులకు అందిస్తున్న సేవలకు గాను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయ కర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలుకు హైదరాబాద్‌కు చెందిన ప్రజాడైరీ ప్రతిక సెలబ్రిటీ అవార్డును త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా అందజేసింది. బాలు వ్యక్తిగతంగా ఇప్పటికి 73 సార్లు రక్తదానం చేయగా, రక్తదాతల సమూహం ద్వారా 2306 యూనిట్ల రక్తం సేకరించారని ప్రజాడైరీ సంపాదకులు సురేష్ అభినందించారు. సినీనటులు మురళీమోహన్, సుమన్, సినీప్రముఖులు అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, విజయభాస్కర్ రామ్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ య.శ్రీనివాస్ గుప్తాలు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నానో యూరియా పిచికారి చేసే యంత్రంపై బుధవారం మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ సదాశివ రెడ్డి మాట్లాడుతూ.. ఇఫ్కో కంపెనీ వారు రైతులు మంచి దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో ఈ డ్రోన్‌లను అందజేసినట్లు తెలిపారు. ఎరువులతో పాటు పురుగు మందులను కూడా పిచికారీ చేయవచ్చన్నారు. వైస్ చైర్మన్ పశుపతి, సీఈవో భైరయ్య, డైరెక్టర్లు భాస్కర్, బత్తుల రాములు, ప్రవీణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలి



కామారెడ్డి రూరల్/రామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణ, మండలంలోని గ్రామ గ్రామ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో వచ్చిన ఫిర్యాదుల వివరాలను బీజేపీ నేతలు బుధవారం స్థానిక ఎంపీడీవో నాగవర్ధన్, తహసీల్దార్ జనార్ధన్‌లకు అందజేశారు. అలాగే రామారెడ్డికి సంబంధించిన ఫిర్యాదులను కూడా రామారెడ్డి ఎంపీడీవో సవిత, తహసీల్దార్లకు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఫిర్యాదుల పెట్టెలను గ్రామాల్లో ఏర్పాటు చేశారని తెలిపారు. ఫిర్యాదులో పెట్టెల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.



సంక్షిప్తం

‘ప్రతి ఒక్కరికి జీవిత బీమా పాలసీలు అందించాలి’

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్ఐసీ ఏజెంట్లు ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలసీలను అందించాలని ఎల్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ కృష్ణ మోహన్ అన్నారు. బుధవారం లింగంపేటలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ) కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు పి.భగవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మేనేజర్ కృష్ణమోహన్, ఏబీఎం జయప్రకాష్, లియాఫీ జాతీయ నాయకులు ఎల్.కిషోర్‌చంద్, డివిజన్ నాయకుడు టి.మోహన్‌లు హాజరయ్యారు. ఏజెంట్ల సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సన్మానించారు.

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే అడ్డుకుంటాం

బాన్సువాడ: బాన్సువాడ డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ హెచ్చరించారు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, కొన్ని పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు కూడా లేవని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని, ప్రభుత్వ వెంటనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్దోస్, ఫరూక్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ఏర్పాటుకు నిధుల మంజూరుపై హర్షం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోలిలింగాల గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం నిధులు మంజూరు కావడంపై బుధవారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధానకూడలిలో టపాకాయలు కాల్చి వారు ఆనందం వెలిబుచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బోధన్–హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి వచ్చే 3.5 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా శిథిలమైందన్నారు. దీనివల్ల చాలాకాలంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో తమ బాధలను గుర్తించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవతో రూ.60లక్షల నిధులు మంజూరైనట్లు వారు చెప్పారు.

ప్రారంభమైన పాఠశాలలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్, 13 ప్రాథమికోన్నత, 36 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం మొదటి రోజున అతి తక్కువ మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899